www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 డిసెంబర్ 2023
5
తిరుపతి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి

మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి..

శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో సిబ్బంది సమ్మెలోకి వెళ్లారన్నారు. మున్సిపల్ కమిషనర్ హరితకు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, ఉపాధ్యక్షులు టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ పెరిగిన ధరల నేపథ్యంలో మున్సిపల్ కార్మికులు చాలీచాలని వేతనాలతో బతుకు జీవనం సాగిస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని సిఎం హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లయినా పట్టించుకోలేదన్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు వస్తాయని, ఈ నేపథ్యంలో సమ్మె తప్ప మరో మార్గం లేకనే సమ్మె చేస్తున్నామన్నారు. ఆప్కాస్ ఉద్యోగులనే పేరిట మున్సిపల్ కార్మికులను సంక్షేమ పథకాలకు దూరం పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి బుజ్జి, పి చిన్న, తంజావూరు మురళి, ఎండి శ్రీనివాసులు, రమేష్, రాధాకష్ణ, జయంతి, మల్లికార్జున రావు, పార్థసారథి, భగత్, రవి, మనీమాల తదితరులు పాల్గొన్నారు.

– పుత్తూరులో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాంట్రాక్టు వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, రిటైర్ అయిన తరువాత పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేశు, మున్సిపల్ యూనియన్ నాయకులు గణేష్ పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తిలో నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. సిఐటియు, ఎఐటియుసి అనుబంధ సంఘాల మున్సిపల్ పారిశుధ్య విభాగం కార్మికులు నిరసనలో పాల్గొన్నారు. సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోపీనాథ్ ముఖ్య అతిథిగా హాజరై సంఘీభావం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 50వేల మంది పారిశుధ్య విభాగం కార్మికులు రోడ్డెక్కారన్నారు. కోవిడ్ సమయంలో మీకు మించిన వారియర్స్ లేరని వేన్నోళ్ల పొగిడిన జగన్, మీకు లక్ష జీతం ఇచ్చినా తక్కువేనని చెప్పారన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు గడిచిపోతున్నా ఇచ్చిన హామీలను ఎందుకు మరిచారని మండిపడ్డారు. డిమాండ్లను సత్వరమే పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు జనమాల గురవయ్య, మించల శివకుమార్, సిఐటియు నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.

– గూడూరు టౌన్‌లో రిలేదీక్షలు చేపట్టారు. సిఐటియు నాయకులు సురేష్, సిపిఎం సెంట్రల్ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ ఒప్పంద కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుడు చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ సిబ్బందికి అలవెన్సులు ఇవ్వాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు 18,500వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోపీనాథ్, పెంచల ప్రసాద్, మురళి, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

– నాయుడుపేటలో యూనియన్ గౌరవాధ్యక్షులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించారన్నారు. ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కార్మికవర్గం వైసిపి ప్రభుత్వాన్ని ఓట్లతో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులుగా బడుగు బలహీన వర్గాల వారే పనిచేస్తునారని, వారి సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. డివైఎఫ్ఐ నాయకులు బాలచంగయ్య మద్దతు తెలిపారు. నాయకులు వెంకటరత్నం, మైలారి శ్రీనివాసులు, నెలవల మస్తానయ్య పాల్గొన్నారు.

– వెంకటగిరిలో సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఎపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు టి.సుబ్బయ్య, కార్యదర్శి ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో సిఐటియు గౌరవాధ్యక్షులు కె.సాంబశివయ్య, బి.పద్మనాభయ్య, అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కె.లక్ష్మయ్య నాయకత్వం వహించి సంఘీభావం తెలిపారు. యుటిఎఫ్ నాయకులు రాజశేఖర్, ప్రభాకర్‌బాబు సంఘీభావం ప్రకటించారు.

మంగళవారం పోరాటాలు హోరెత్తాయి.. ఇప్పటికే ఓ వైపు అంగన్‌వాడీలు పక్షం రోజులుగా సమ్మె చేస్తూ మంగళవారం పళ్లెంపై గరిటెతో కొడుతూ 'కరోనా లాంటి జగన్ వెళ్లిపోవాలి' అంటూ నినదించారు. తమ సమస్యలు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. వీరి సమ్మెకు జనసేన జిల్లా నాయకులు పసుపులేటి హరిప్రసాద్ మద్దతు ప్రకటించారు. ఇక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె భేరి మోగించారు. మున్సిపల్ కేంద్రాలన్నింటిలోనూ పెద్దఎత్తున నిరసనలు జరిగాయి. ఇవేమీ పట్టని రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' అంటూ అట్టహాసంగా ప్రారంభించింది.

ఎస్ఎస్ఏ కార్మికులకు జనసేన మద్దతు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతిలో..

ఎస్ ఎస్ ఎ కార్మికుల సమ్మెకు జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ తెలిపారు. మంగళవారం తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఏలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ హరిప్రసాద్ ప్రసంగించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంపదను అదానీ, అంబానీలకు పంచాలని నిర్ణయించుకున్నట్టుగా ఉందని, రాష్ట్రంలోని కష్టజీవుల సమస్యలను పట్టించుకోవడంలో ఏమాత్రం బాధ్యతగా వ్యవహరించడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పనులు చేయించుకునేటప్పుడు వీరిని రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వారిగా మాట్లాడతారని, జీతం గురించి అడిగితే కేంద్రానికి సంబంధించిన వారని మాట్లాడుతారని ఆయనఅన్నారు.సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయకుండా కుటుంబాలను ఎలా నడపాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాజారెడ్డి,ఎస్ఎస్ఏ యూనియన్ నేతలు మాధవయ్య, వాసవి, మోహన్, ధనపాల్, జనార్ధన్, లలిత, ప్రసాద్, ప్రశాంత్, శివ, వేణు, రమణ పాల్గొన్నారు

ప్లేట్లు, గరిటలతో శబ్దం చేస్తూ...

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీల సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు ప్లేటుపై గరిటలతో శబ్దం చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

– తిరుపతి టౌన్‌లో ప్లేటుపై గరిటతో శబ్దం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె ప్రారంభమై పక్షం రోజులు దాటినా రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతుపై వర్షం కురిసినట్లు వ్యవహరిస్తోందన్నారు. జీతాల గురించి, గ్రాడ్యూటీ గురించి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. మూడు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించని పక్షంలో రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలాని మద్దతు తెలిపారు. నాయకులు టి.సుబ్రమణ్యం, విఎస్ కుమార్, పరశురాం, పి.బుజ్జి, పార్థసారథిరెడ్డి, నాగరాజమ్మ, అరుణ, రాజరాజేశ్వరి, సరస్వతి, గీత పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తిలో ప్లేట్లపై గరిటలతో శబ్దాలు చేస్తూ జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, రేవతి, పుష్ప, సౌజన్య, రాజా, భారతి, సక్కుభాయమ్మ, స్వర్ణ పాల్గొన్నారు.

– బుచ్చినాయుడు కండ్రిగలో ప్లేటు కొట్టుకుంటూ నిరాహారదీక్షలో పాల్గొన్నారు. సత్యవేడు సిపిఎం నాయకులు నాగరాజు పాల్గొన్నారు. నాయకులు శోభ, కె.సుదర్శన పాల్గొన్నారు.

– నాయుడుపేటలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ 15 రోజుల నుంచి అంగన్‌వాడీలను కొంతమంది అధికార పార్టీ ఎంఎల్‌ఎలు కించపరిచే విధానాలు మాట్లాడుతున్నారని, ఇది సరికాదన్నారు. జగనన్న జెండా కలర్ యూనిఫాం వేసుకుని శిబిరంలో సమ్మె చేస్తున్నా తమపై దయలేదా?

అని ప్రశ్నించారు. జీతం పెరిగే వరకూ పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రాజేశ్వరమ్మ, నాయకులు శివకవి ముకుందా, ఎం.శ్యామలమ్మ, కళాశతి, రూప, మేరీ, ప్రమీల, పెంచలమ్మ, విజయ, జానకమ్మ, నాగమ్మ పాల్గొన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, మండల కార్యదర్శి భాగ్యమ్మ, భాగ్యలక్ష్మి, ఎస్‌కె అఫ్సానాలు తహశీల్దార్ రాజేంద్రకు వినతిపత్రం అందించారు.

– గూడూరు టౌన్‌లో టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుని పళ్లాలపై గరిటలతో మోగిస్తూ నిరసన తెలిపారు. అనంతరం కోలాటం నిర్వహించారు. తాము గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, సిఎం ఏ హామీలు అయితే ఇచ్చారో వాటినే అమలు చేయాలని కోరుతున్నామన్నారు. స్థానికులు అంగన్‌వాడీ సిబ్బందికి మద్దతుగా నిలుస్తున్నారు. తల్లులు, వారి పిల్లలు రోడ్లపైకి వచ్చి 'మా టీచర్ మాకు కావాలి' అంటూ ధర్నాలు, నిరసనలు తెలియజేస్తుంటే స్పందించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె.రమేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.హరిబాబు సంఘీభావం తెలిపారు.

యూనియన్ నాయకులు కె.ఉష పాల్గొన్నారు. డిప్యూటీ ఎంఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. నాయకులు ఎ.ఇంద్రావతి, ఎస్. సురేష్, జోగి శివకుమార్ పాల్గొన్నారు.

– వెంకటగిరిలోనూ సమ్మె కొనసాగింది. సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, ఐసిడిఎస్ వెంకటగిరి ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.స్వరూపరాణి, మండల అధ్యక్షులు సుభాషిణి నాయకత్వం వహించారు. ప్రభుత్వం స్పందించకపోతే అంగన్‌వాడీలు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు.

– రేణిగుంటలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీలు చేసే పోరటానికి సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సంపూర్ణ మద్దతు ఉంటుందని, మీ పోరాటం మిగతా కార్మిక యూనియన్లకు ఆదర్శంగా నిలవాలన్నారు. వైష్ణవి, శారద, వసంత, భారతి, లక్ష్మీ, రాధ, సుజాత, ధరణి, విజిత, మహేశ్వరి తదితరులు నిరసన దీక్షలో కూర్చున్నారు. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ప్రియ, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి గంగాదేవి, నాయకులు హరినాథ్, ఒ.వెంకటరమణ, సెల్వరాజ్ మద్దతు తెలిపారు.

– చంద్రగిరిలో మోకాళ్లపై నిరసన తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, సిఐటియు నాయకులు లక్ష్మి, విజయకుమారి, నాగభూషణమ్మ, లీల, నాగరాజమ్మ పాల్గొన్నారు.

– నారాయణవనంలో ఎంఆర్‌ఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు పద్మావతి, నరసమ్మ, లత పాల్గొన్నారు.

– పుత్తూరులో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, కార్యదర్శి ఆర్.వెంకటేష్ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు మునికుమారి, విజయ్‌కుమార్, ధనమ్మ, రాధ, లలిత, అన్నపూర్ణ, మోహన్‌లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే 'ఆడుదాం..ఆంధ్రా'

జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ పనిచేసినా ఒక చరిత్ర అని, క్రీడాకారుల గుర్తింపు, యవత ప్రతిభను గుర్తించి వారి దేహదారుడ్యం, మేధస్సు పెంచడం లక్ష్యంగా దేశంలోనే వినూత్నరీతిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహణకు శ్రీకారం చుట్టారని డిప్యూటి సి ఎం కె.నారాయణ స్వామి అన్నారు. నెహ్రూ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో జిల్లా వ్యాప్తంగా క్రీడల నిర్వహణకు డిప్యూటి సిఎం ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి , క్రీడా టార్చ్ రిలే ను జిల్లా క్రీడాకారులకు అందించి, మస్కట్ లోగో ను, జాతీయ జెండా , ఆడుదాం ఆంధ్రా జెండా ను ఆవిష్కరించి, క్రీడల ప్రతిజ్ఞ చేపట్టారు. సభాధ్యక్షులుగాకలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, అతిథులుగా నగరపాలక కమిషనర్ హరిత, మేయర్ శిరీషా, డిప్యూటి మేయర్లు భూమన అభినయరెడ్డి, ముద్రనారాయణ పాల్గొన్నారు.

డిప్యూటి సి ఎం మాట్లాడుతూ క్రీడాకారులను గుర్తించి దేశ, ప్రపంచ స్థాయి పోటీల్లో యువతను భాగస్వామ్యం చేయాలని ముఖ్యమంత్రి ప్రతి ఏటా డిసెంబర్ మాసంలో జరిగేలా నిర్ణయించారని అన్నారు. పేదలకు విద్యను అందిస్తే సంపద అందించినట్లే అని గుర్తించి కులం మతం పార్టీ వంటివి చూడక అమ్మ ఒడి పథకం పెట్టారని, ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ మీడియం, విద్యాకానుక పేరుతొ యునిఫాంతో సహా పుస్తకాలు అందిస్తున్నారని అన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం – ఆంధ్రా క్రీడా పోటీలు రాష్ట్ర చరిత్రలోనే మొదటిదని , శరీరం ఆరోగ్యంగా ఉంటే ఆలోచనలు కూడా అంతే స్థాయిలో గొప్పగా ఉంటాయని , ప్రస్తుత సమాజంలో టీవిలకు, సెల్ ఫోన్లకు అంకితమై మనుష్యుల మధ్య సంబంధాలు దూరమవుతున్నాయని, వాటిని ఈ క్రీడలతో అధిగమించ వచ్చని అన్నారు. గత నాలుగు నెలలుగా అధికారులు నిర్వహణపై దష్టి పెట్టారని, క్రీడల నిర్వహణ ఆషామాషీ కాకుండా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్లు, సచివాలయ స్థాయి నుండే అవగాహన , 2 కె రాన్ వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 1 లక్ష 70 వేలకు పైగా క్రేదాకరులు, క్రీడలను చూడడానికి 35 లక్షల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, జిల్లాలో ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వామ్యులు అయి విజయవంతం చేయాలని అన్నారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్ , బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడాకారుడు సజన పాల్గొన్నారు.

కార్మికులపై టిటిడి వరాల జల్లు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఉద్యోగ కార్మికులపై వరాల జల్లు కురిపించింది. తిరుమల అన్నమయ్య భవన్‌లో ధర్మకర్తల మండలి సమావేశం ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉదయం జరిగింది. వేతనాల విషయంలో కల్యాణకట్ట క్షురకులకు, పోటు కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు మొత్తం దాదాపు 3వేల మందికి లబ్ది చేకూరనుంది. అలాగే గురువారం టిటిడి ఉద్యోగులకు ఇంటి స్థలాలను పంపిణీ చేయనున్నారు. మిగిలిన వారికి మరో 350 ఎకరాలు కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ధర్మకర్తల మండలిలో తీసుకున్న నిర్ణయాలివే..

– తిరుమల కల్యాణకట్టలో పీస్‌రేట్ లెక్కన పనిచేస్తున్న క్షురకులకు ఊహించని విదంగా నెలకు రూ.20వేల రూపాయల కనీస వేతనం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం వల్ల దాదాపు 250 కుటుంబాలకు మేలు జరగనుంది.

– అలాగే శాశ్వత ఉద్యోగులు కాని పోటు కార్మికులకు రూ.10వేలు వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల దాదాపు 350 కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. వాహన బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ లేబర్‌గా గుర్తించి జీతాలు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు.

– టిటిడిలోని వివిధ విభాగాల్లో మిగిలిన కాంట్రాక్టు కార్మికుల జీతాలు కనీసం రూ.3వేలు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం వల్ల దాదాపు 2వేల మంది కార్మికులు ప్రయోజనం పొందనున్నారు.

– అలాగే పెద్దజీయర్, చిన్నజీయర్ మఠాల నిర్వహణ, అక్కడి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడానికి పెద్దజీయర్ మఠానికి ఏటా రూ.60 లక్షలు, చిన్న జీయర్ మఠానికి ఏటా రూ.40 లక్షల అదనపు ఆర్థిక సాయం చేయాలని బోర్డు నిర్ణయం తీసుకుంది.

టిటిడి బోర్డులో పలు తీర్మానాలు

– టీటీడీ లోని ప్రతి ఉద్యోగికి, రిటైర్డ్ ఉద్యోగికి ఇంటి స్థలం ఇప్పించే బాధ్యత తనదని ప్రకటించిన ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి మాట నిలుపుకుంటున్నారు. ఎల్లుండి తొలి విడతగా 3518 మంది ఉద్యోగులకు మహతి ఆడిటోరియంలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేయబోతున్నారు. మరో వారం పది రోజుల్లో ఇంకో 1500 మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వానికి 80 కోట్ల రూపాయలు చెల్లించి మరో 350 ఎకరాల భూమి సేకరించి ఫిబ్రవరిలోపు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడానికి టీటీడీ బోర్డు తీర్మానం చేసింది.

పోటు, వాహన బేరర్ల కృతజ్ఞతలు

పోటు కార్మికులకు 10 వేల జీతం పెంచుతూ మంగళవారం నిర్ణయం తీసుకోవడం పట్ల తిరుమల శ్రీవారి ఆలయ పోటు కార్మికులు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీవారి దర్శనానికి వెళ్ళిన ఛైర్మన్ ను పోటు కార్మికులు ఆలయంలో కలిసి కతజ్ఞతలు తెలిపారు. తమకు ఒక్క సారిగా 10వేల జీతం పెరుగుతుందని కలలో కూడా ఊహించలేదని వారు సంతోషం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు కతజ్ఞతగా ఉంటాయని చెప్పారు. సుమారు 600 కుటుంబాలకు దీని వల్ల ప్రయోజనం కలిగిందని వారు చెప్పారు. అంతకు ముందు వాహనం బేరర్లు ఛైర్మన్ ను కలిసి తమ అభ్యర్థన మన్నించి తమను స్కిల్డ్ వర్కర్స్ గా గుర్తిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే ఈ సహాయం చేస్తారని తాము ఊహించలేదని కతజ్ఞతలు తెలిపారు.

అటవీ కార్మికులు గుర్తుకురాలేదా : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నేటికి 1150 రోజులుగా రిలేదీక్షలు చేస్తూ న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న టిటిడి అటవీ కార్మికుల సమస్య టిటిడి పాలకమండలికి పట్టదా? అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాలకమండలిని ప్రశ్నించారు. ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్ అయ్యారన్న సంతోషం వారిలో లేదన్నారు. బాధ్యతలు తీసుకున్న తరువాత అటవీ కార్మికులు జ్ఞప్తికి రాలేదా? అని ప్రశ్నించారు. కరుణాకర్‌రెడ్డి సభ్యులుగా ఉన్న పాలకమండలిలోనే 2019లో అటవీ కార్మికులకు టైంస్కేల్ ఇవ్వాలన్న నిర్ణయం జరిగిందని, అది అమలు కాకుండానే వారిని లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్‌లో బలవంతంగా చేర్చారని, ప్రస్తుతం దీక్షలు చేస్తున్న కార్మికుల కంటే జూనియర్లను పర్మినెంట్‌చేశారని విమర్శించారు. ఇంతటి అన్యాయం జరిగినా పాలకమండలికి, టిటిడి ఈవోకు అదేమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ధర్మాన్ని రక్షించండి.. ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రచారం చేసే టిటిడి యాజమాన్యం పాలకమండలిలో అటవీ శాఖకు జరిగిన అధర్మాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని కోరారు. టిటిడిలో కాంట్రాక్టు కార్మికులకు పెంచిన వేతనాలు ఇంకా అమలు కాలేదని గుర్తు చేశారు.

కుష్ఠు వ్యాధి రహితమే లక్ష్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కుష్ఠు వ్యాధి రహిత తిరుపతి జిల్లా లక్ష్యంగా కుష్ఠు వ్యాధి రోగుల గుర్తింపు అవగాహన కార్యక్రమం అనగా లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమం తిరుపతి జిల్లాలో ఈ నెల 27వ తేదీ నుండి జనవరి 12 వరకు మొత్తం 17 రోజులు నిర్వహించ నున్నామని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారిని డాక్టర్ సి అరుణ సులోచన దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు వివరిస్తూ ఈ కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమం సందర్భంగా ఇంటింటికీ సచివాలయ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది రావడం జరుగుతుందన్నారు. వారికి పూర్తి సహకారం అందించి అనుమానం ఉన్నట్లైతే పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుందని, వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎండిటి మందులు పూర్తి ఉచితంగా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కుష్టు వ్యాధి రహిత తిరుపతి జిల్లా లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా సమన్వయంగా పనిచేసి సహకారం అందించాలని కోరారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం:కలెక్టర్

ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యూ .హెచ్ .ఓ . ప్రమాణాలను పాటిస్తూ అన్నిరకాల సౌకర్యాలు కల్పించిందని అందుకుతగ్గట్టు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిమగ్నం కావాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రవేట్ డాక్టర్లతో, స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా అడిషనల్ ఎస్ పి వెంకటరావు, డి ఎం హెచ్ ఓ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి ఆసుపత్రులవరకు అన్నివసతులు , మందులు , వైద్యులు వున్నారని, దాదాపు మెడికల్ ఉద్యోగాలు ఖాళీలు లేవని అన్నారు. సచివాలయ స్థాయిలో విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటుతో సిహెచ్ సి లను నియమించి అందుబాటులో వుండాలని ప్రభుత్వ వసతి కల్పించేలా నిర్మిస్తున్నామని అన్నారు. గ్రామస్థాయిలోనే 7 రకల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులోకి వచ్చిందని అన్నారు. సదుపాయాలు వున్నాయని వైద్యసేవల్లో నిమగ్నమై తాముచేస్తున్న వృత్తి పై సంతృప్తి చెందేలా పనిచేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. డి ఎం హెచ్ ఓ డాక్టర్ యు. శ్రీహరి పాల్గొన్నారు.

చాక్లెట్ల తయారీలో సునంద ప్రతిభ

పుత్తూరు టౌన్ : పట్టణానికి చెందిన జి.సుబ్రమణ్యం రాజు (రిటైర్డ్ సీనియర్ మేనేజర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పుత్తూరు బ్రాంచి) కుమార్తె జి.సునంద చాక్లెట్ల తయారీకి సంబంధించి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో డిసెంబర్ 22న పాల్గొన్నారు. అమ్మమ్మ ఒడి (ఫేస్‌బుక్ గ్రూప్ ఆన్‌లైన్) నిర్వహించిన పోటీల్లో 76 మంది పాల్గొని 7003 చాక్లెట్లను తయారు చేశారు. సునంద పాల్గొన్న రెండో ప్రపంచ రికార్డు. దీనికి ముందు ఆమె మహిళా మనో వికాస్ సంస్థ నిర్వహించిన 250 మంది సభ్యులతో 'ది లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోచెట్ పోన్స్‌లు చేయడంలో ఆమె పాల్గొన్నారు.

దేశ భవితకు కమ్యూనిజమే శరణ్యం

తిరుపతి సిటీ : భారతదేశ భవితకు కమ్యూనిజమే శరణ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి .హరినాద్ రెడ్డి స్పష్టం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 99వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు తిరుపతి నగరంలో ఘనంగా జరిగాయి తిరుపతి జిల్లా సిపిఐ కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాద్ రెడ్డి ఎగురవేశారు అనంతరం గంధమనేని శివయ్య కష్ణారెడ్డి మెమోరియల్ హాల్ నందు సిపిఐ 99 వ వార్షికోత్సవ కేకును కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సభకు జల్లా విశ్వనాద్ అధ్యక్షత వహించారు.

18 నుంచి 'సుస్థిర అభివృద్ధి' జాతీయ సదస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సుస్థిర అభివద్ధి లక్ష్యాల జాతీయ సదస్సు కొన్ని రాష్ట్రాల్లో జరగనున్నదని అందులో మన రాష్టానికి చోటు లభించిందని, జనవరి 18 నుండి 20 వరకు తిరుపతిలో నిర్వహణకు జిల్లా యంత్రాంగం జిలా కలెక్టర్ వారి ఆదేశాలతో ఈ జాతీయ సదస్సు విజయవంతం చేయాలని పంచాయితీ రాజ్, రూరల్ డెవెలప్ మెంట్ కమిషనర్ సూర్యకుమారి అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తో కలసి పంచాయితీ రాజ్ రూరల్ డెవెలప్ మెంట్ కమిషనర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి సదస్సు నిర్వహణకు అన్నిరాష్ట్రాల నుండి దాదాపు 1000 మందికి పైగా డెలిగేట్స్ రానున్నారని, కేంద్ర రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారని అందుకు తగ్గ ఏర్పాట్లు , అధికారులకు విధులు, లైజన్ ఆఫీసర్ల నియామకం కేటాయించాలని జిల్లా రెవెన్యూ అధికారి వారికి సూచించారు. జాతీయ సదస్సు నిర్వహణ కోసం శిల్పారామంలో అందుకు తగ్గ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇందులో సుస్థిర అభివద్ధి లక్ష్యాలలో భాగస్వామ్య శాఖలు అయిన ఆరోగ్యశాఖ, ఐసి డి ఎస్ , విద్యాశాఖ, పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా , డ్వామా , డి ఆర్ డి ఎ శాఖలు తమ ప్రగతిని చూపే విధంగా స్టాల్స్ ఏర్పాటు, క్షేత్రస్థాయి పరిశీలనకు సహకరించాలని , రూట్ మ్యాప్ సిద్ధం కావాలని సూచించారు. డిప్యూటి కమిషనర్ పి ఆర్ ఆనంద్ , జిల్లా పరిషత్ సిఇ ఓ ప్రభాకర్ రెడ్డి, డి ఆర్ ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బిస్కెట్లు పంపిణీ

తిరుపతి టౌన్ : వంటవీటి మోహనరంగా 35వ వర్ధంతి సందర్భంగా తిరుపతి భవానీనగర్‌లోని ఆదరణ వృద్ధాశ్రమానికి నెలకు సరిపడా బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రాధారంగ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షులు వంగవీటి నరేంద్ర ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా రాధారంగ మిత్రమండలి అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. రంగా చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వి.జగన్నాధం, బాసికర్ల రఘు, డాక్టర్ కరుణానిధి పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో కాపునేత వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ట్రస్టు బోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతుల పొలాల్లో అపహరణకు గురైన విద్యుత్ స్టాటర్లు, వైర్లు

పొలాల్లో మోటారు స్టాటర్లు, వైర్లు చోరీ

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామపంచాయతీలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్టార్టర్లు, కేబుల్స్ దొంగలు దాదాపు 40 మోటార్లకు చెందిన వైర్లను కత్తిరించి స్టార్టర్స్ ను దొంగిలించారు. ఉదయం లేచి రైతులు పొలం వెళ్లి చూడగా స్టార్టర్స్, వైర్స్ లేకపోవడం వల్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులు వెంటనే స్పందించి స్టార్టర్ల దొంగల పై తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిఎస్‌పి, సీఐ

ప్రజాశక్తి -రామచంద్రాపురం : చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను చంద్రగిరి డిఎస్పి డాక్టర్ యశ్వంత్, సిఐ రాజశేఖర్ పరిశీలించారు. మంగళవారం మధ్యాహ్నం నడవలూరు, నెన్నూరు, వెంకటరామాపురం, రావిళ్ళ వారి పల్లి, సి రామాపురం, కమ్మ కండ్రిగ పోలింగ్ కేంద్రాలతో పాటు రాయల చెరువు కట్ట కింద ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు, పోలింగ్ కేంద్రాల గదులకు 'కిటికీలు, తలుపులు సక్రమంగా ఉన్నాయా? లేదా?' అనే అనే విషయాలను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలను ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును భయపడకుండా ప్రశాంతంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన భూములు ఆక్రమించిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం, జనసేన, అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన

గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు దాసరి జనార్ధన్

ప్రజాశక్తి - కెవిబిపురం: కేవిబిపురం మండలంలో గిరిజన భూములు ఆక్రమించుకొన్న పెత్తం దారులు గిరిజనులను భయాందోళనకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజనులకు మద్దతుగా సిపిఎం, జనసేన, అంబేద్కర్ సంఘం నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, , సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ మండల కేంద్రమైన కేవీబి పురం పంచాయతీ పరిధిలోని ఏకైక గిరిజన కాలనీకి చెందిన ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 213లో 4 ఎకరాలు 50 సెంట్లు భూమిని గత 30 సంవత్సరాలుగా అక్కడ నివాసమున్న యానాదులు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారన్నారు. ఈ భూమిపై కన్నుబడిన గ్రామంలోనే అగ్రకుల పెత్తందారులు, యానాదులను కత్తులు చూపించి భయపెట్టి, బెదిరించి జెసిబిలతో చదును చేస్తూ ఆక్రమించుకోవడంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని గిరిజనులకు స్వాధీనపరిచి అక్కడ నివాసమున్న ప్రతి గిరిజన కుటుంబాలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇవ్వాలని జనార్ధన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు మద్దతుగా జనసేన కెవిబి పురం మండల అధ్యక్షులు వి థామస్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు మురగయ్య, పాల్గుణ మాట్లాడుతూ మండలంలో దళితులు, గిరిజనుల భూములను అగ్రకుల పెత్తందారులు ఆక్రమించుకుంటున్నారని ఆవేదన చెందారు. తక్షణమే కేవీబి పురం యానాదులకు ప్రభుత్వ భూమిని స్వాధీనపరిచి వారికి పట్టాలు ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జెండాలు నాటి ఆక్రమిస్తామని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దారు శ్రీదేవికి ఇచ్చారు. స్పందించిన తహశీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ తక్షణమే విచారణ జరిపి ఆక్రమణలు తొలగించి గిరిజనులకు ఇంటి స్థలాల మంజూరుకు 90 రోజుల పథకం ద్వారా నమోదు చేయించి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు . ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు , గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

ద్రౌపది ఆలయంలో భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పౌర్ణమి సందర్భంగా నటరాజ మొదలియార్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, టీడీపీ నాయకుడు పి మోహన్ ద్రౌపది దేవి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. భక్తులకు చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి నాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బీసీ ఆర్ యుగంధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ చేతుల మీదుగా 400 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, పేదవారికి ఒక పూట కడుపు నింపడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ, రూరల్ టీడీపీ అధ్యక్షుడు డి రవికుమార్, టీడీపీ నాయకులు కృష్ణకుమార్, ఈశ్వర్ యాదవ్, నాగరత్నం, సోము, గోపీనాథ్, రాజేంద్ర, హమీద్ బాషా పాల్గొన్నారు.

వైసిపి నేత హరిచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేస్తున్న నాయకులు

వైసీపీ నేత హరిచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : వైసీపీ నేత, పారిశ్రామికవేత్త, కనుమూరు హరిచంద్రా రెడ్డి జన్మదిన వేడుకలు గూడూరు పట్టణంలో ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియారం స్తంభం వద్ద ఆయన అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థ సేవకుడు హరి చంద్రారెడ్డి అని కొనియాడారు. భవిష్యత్ లో మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు రూపేష్ రెడ్డి, చంటి, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

టిటిడి పాలకమండలి అవినీతి మయం: కాంగ్రెస్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీటీడీ ధర్మకర్తల మండలి దారుణమైన అవినీతి కూపంగా మారి పోయిందని 20 శాతం కమీషన్ ఇస్తే గాని పనులు జరిగే పరిస్థితి లేదని కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీకి చెందిన ఇంజనీరింగ్ విభాగంలో టెండర్ వేయాలంటే 8 శాతం, టెండర్ ప్రక్రియలో పాల్గొని టెండర్ దక్కించుకున్న తర్వాత 12 శాతం నిధులు ఇస్తేనే పనులకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. ధర్మక్షేత్రంలో ప్రతి పనికి ఓ రేటు కట్టి చివరికి స్వామివారి దర్శన టికెట్లను, గృహాలను అమ్ముకుంటున్నారని తీవ్ర స్థాయిలో విమర్శిం చారు. కాంగ్రెస్ తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా తేజోవతిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. జిల్లాలోని కాంగ్రెస్ కన్వీనర్లుగా ఏడుగురిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రవి, గోపి, శాంతియాదవ్, నాగరాజు, శోభ, అబ్దుల్ మజీద్, జావేద్ పాల్గొన్నారు.

నియామకపు పత్రాలను అందిస్తున్న శ్రీనివాసరెడ్డి

యువత చేతిలోనే దేశ భవిష్యత్

'ఆదిశంకర' గ్రాడ్యుయేషన్ డేలో జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ రంగా జనార్ధన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నట్లు భారతదేశం విశ్వ గురువుగా రూపాంతరం చెందాలంటే యువతపైనే ఆధారపడి ఉందని అనంతపురం జేఎన్‌టియు వైస్ ఛాన్సలర్ రంగా జనార్ధన్ సూచించారు. సోమవారం తిరుపతి జిల్లా గూడూరు పట్టణ పరిధిలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఏడవ గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం నిర్వహించారు. గూడూరు పట్టణ పరిధిలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఏడవ గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జెఎన్‌టియు అనంతపురం విసి రంగా జనార్ధన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇంజనీరింగ్ రంగంలో భారతదేశం ప్రత్యేక స్థానం సాధించిందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు వారిలోని నైపుణ్యాలను ప్రదర్శించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఆది శంకర విద్యాసంస్థల వ్యవస్థాపకులు వంకి పెంచలయ్య మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఇంజనీర్లుగా తమ కళాశాల నుండి విద్యార్థులు అనేక నైపుణ్యాలతో బయటకు వెళ్లడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ ధనుంజయ, హెచ్‌వోడిలు విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా సర్టిఫికెట్లు స్వీకరించిన ఇంజనీరింగు విద్యార్థులు

ట్యాలీ కోర్సుతో మంచి ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మంచి ఉద్యోగ అవకాశాలు పొందడానికి ట్యాలీ కోర్సు ఎంతో ఉపయోగకరమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 50 రోజుల పాటు ట్యాలీ కోర్సును నిర్వహించారు. మంగళవారం ట్యాలీ కోర్సు ముగింపు ఉత్సవానికి కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో వ్యాపారాన్ని వేగంగా, సక్రమంగా మదింపు చేయడానికి, తక్కువ శ్రమతో బిజినెస్‌ను అభివృద్ధి చేయడానికి ట్యాలీ వంటి కోర్సులు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ఈ కోర్సును పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థు లుగా 25 ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు జి. తిరుమల య్య, డాక్టరు ఏ దేవకి, డాక్టరు వి వాసవి, జి. గంగయ్య, డాక్టరు కె శ్రీనివాసులు, డాక్టరు మురళీమోహన్ రెడ్డి, జ్యోతి, లక్ష్మీబాయి, నాగరాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్యాపకులతో ట్యాలీ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు

కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలి: ఏపీడీ

ప్రజాశక్తి - బాలాయపల్లి : ఉపాధి హామీ పనులు కొలతల ప్రకారం చేయాలని ఉపాధి పథకం క్లస్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలం లోని స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ మేట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం కూలీల వద్ద పనులు చేయిస్తేనే పనికి తగ్గ కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. ఏ పనులు ఎక్కడెక్కడ చేస్తున్నారో పూర్తి వివరాలు ఉండాలన్నారు. కూలీలకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉపాధి పనులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా మేట్లు పైనే ఉందని తెలిపారు. మేట్లు పనులు ప్రారంభించక ముందే కొలతలు నిర్వహించి ఇంత కొలత అని ఇస్తే అంత డబ్బే వస్తుందని కూలీలకు తెలిపి ఆ తరువాత పనులు ప్రారంభించాలన్నారు. ఉపాధి పథకం పనుల్లో మేట్లు కీలకమన్నారు. కూలీలకు గిట్టుబాటు రావాలన్నా, నష్టం జరగాలన్నా మేట్లు పైనే ఆధారపడి వుందన్నారు. ఈ కార్యక్ర మంలో ఉపాధి హామీ ఏపీఓ మృత్యుంజయుడు, ఉపాధి మస్టర్ డిఆర్పి రాఘవేంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్

యువత దృష్టిని మళ్లించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

తెలుగు యువత నాయకుల విమర్శ

తిరుపతి(మంగళం): రాష్ట్రంలో ని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని పాదయాత్రలో హామీ ఇచ్చి నేడు యువత దృష్టిని దారి మళ్లించేందుకు 'ఆడుదాం ఆంధ్ర' అంటూ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవి నాయుడు విమర్శించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువత డిగ్రీ పట్టాలు చేత పట్టుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ఉద్యోగాలు కల్పిస్తానన్న సీఎం జగన్ నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని హామీలు గుప్పించి ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో యువత అయోమయంలో పడ్డారన్నారు. సకాలంలో ఉద్యోగాల నోటిఫికేషన్లు రాకపోవడంతో అభ్యర్థుల వయోపరిమితి నిబంధన దాటి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో యువత దృష్టిని మళ్లించేందుకు పక్కా వ్యూహంగా 'ఆడుదాం ఆంధ్ర' నాటకానికి తెరతీశారన్నారు. క్రీడలపై కనీస అవగాహన లేని వ్యక్తిని ఆ శాఖకు మంత్రిగా చేశారన్నారు. ప్రజా ప్రయోజ నాలను విస్మరించి యువతను గాలికి వదిలేసిన వైసిపి సర్కారుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కులాల మధ్య చిచ్చు రేపేందుకు వ్యూహం లాంటి సినిమాలను దర్శకుడు రాంగోపాల్ వర్మ నిర్మిస్తున్నారని అదిచట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, పెరుమాళ్ మధు, రంజిత్, వాసు, సందీప్,శీనివాస్‌యాదవ్, లోకేష్, నవీన్, మంజు, నాగేంద్ర, శ్రీరామ్ బాబి, జనార్ధన్ పా ల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న తెలుగు యువత నాయకులు

నైపుణ్యం వెలికితీయడానికే 'ఆడుదాం ఆంధ్ర': ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గ్రామ స్థాయి నుండి క్రీడాకారులను ఎంపిక చేసి, రాష్ట్రస్థాయిలో వారి ప్రతిభ వెలికి తీయడమే 'ఆడుదాం ఆంధ్ర' లక్ష్యమని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో 'ఆడదాం ఆంధ్ర'ను ఎమ్మెల్యే వరప్రసాద్ రావు లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకుని వారికి క్రీడా పరికరాలను అందజేసి, నాయకులతో కలిసి క్రికెట్ ఆడారు. క్రీడల వల్ల కలిగే ఉపయోగాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, బత్తిన విజయ్ కుమార్, కోడూరు కల్పలత, మనుబోలు కృష్ణయ్య పాల్గొన్నారు.

గూడూరులో క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 'ఆడుదాం అంధ్రా' క్రీడలను ఎంపిపీ సుబ్బలక్ష్మి, ఎంపిడీవో సాయిలహరి బీఎన్ కండ్రిగలో జిల్లా పరిషత్తు ఆట స్థలంలో మంగళవారం ప్రా రాభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడా కిట్లు పంపిణీ చేసి క్రికెట్ ఆటను ఆడించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని 43 రోజులు పాటు 5 స్థాయిలో 299 మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. మండలంలో ఉన్నత పాఠశాలలో ఈ క్రీడ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో మునిసుబ్రమణ్యం, వైయస్సార్ సీనియర్ నాయకులు గురునాథం సర్పంచి వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, కార్యదర్శి ఇందిర పిఈటి మస్తానయ్య పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా సచివాలయ స్థాయి ఆటలను ఎంపిపి బాలం యుగంధర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికే క్రీడలు ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ కొండా రెడ్డి, సర్పంచ్ లు మనోహర్, భూపాల్, నాయకులు భాస్కరరెడ్డి, బావాజి, ఇర్షాద్, కదీర్, ఎంపిడిఒ దేవేంద్ర బాబు, ఈఓపిఆర్డి సోమశేఖర్ రెడ్డి, సెక్రటరీ మదనమోహన రాజు, వాలంటీర్లు, క్రీడాకారులు, ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్యవేడు: క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్,బెల్ట్ రమేష్ హాజరయ్యారు. తొలి రోజు సత్యవేడు పట్టణంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 48 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ఎంఈఓ ఉష. ఉపాధి ఏపీవో కృష్ణయ్య, సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ ముని రవికుమార్, వ్యవసాయ మండల సలహా సంఘం చైర్మన్ ప్రసాద్ రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, ఎంపిటీసీలు బాలయ్య,సరవన,సర్పంచులు రవి రెడ్డి,శేఖర్, నారాయణవనం అన్నా దొరై, వైసిపి నాయకులు గురుప్రసాద్, పునీత్ కుమార్, రాబర్ట్, ఎంపి రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : మండల కేంద్రంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తహశీల్దారు గోపీనాథ్ రెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య, స్థానిక సర్పంచ్‌లు లాంఛనంగా ప్రారంభించారు. జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఏకొల్లు యువత క్రికెట్ గేమ్‌ను ప్రారంభించారు. కుప్పారెడ్డిపాలెం, ఏ కోళ్ళు టీంలు మధ్య జరిగిన క్రికెట్ ఆటలో విజేతలుగా ఏకొల్లు యువత ప్రతిభ కనపరచి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఏ కోల్లు కార్యదర్శి రామయ్య, వెదురుపట్టు కార్యదర్శి రాజా పి ఈ టి లలిత క్రీడలు నిర్వహణలో పాల్గొన్నారు ప్రాథమిక వైద్య చికిత్స నిమిత్తం వైద్య సిబ్బంది మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎం ఎల్ హెచ్ పి మౌనిక, ఏఎన్ఎం లు శ్రావణి, దోరతి, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ ఆశా కార్యకర్తలు మంజుల, వీరమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సత్యవేడులో క్రికెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

కెవిబిపురం: కే వి బి పురం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను ఆడుదాం ఆంధ్ర పోటీలను హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముని లక్ష్మీ నందకుమార్, అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్ :వెంకటగిరి మండలం పారవోలు సచివాలయం పరిధిలోని 'ఆడుదాం ఆంధ్ర' ఆటలు పోటీలను ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ నెల్లూరు అమ్ములు, పుల్లూరు శ్రీదేవిఎం పిటిసి చేతుల మీదుగా యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేసి ప్రారంభించారు. అనంతరం ఇంచార్జి మండల అధికారి విజయలక్ష్మి , మండల తహశీల్దార్ పద్మావతి క్రీడలు ప్రోగ్రాం ఆఫీసర్ పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరావు అధ్యక్షతన టోర్నమెంట్ క్రీడలు తొలి రోజు జెండా ఊపి ప్రారంభించారు.

తడ: మండలం లోని తడ, తడ కండ్రిగ, పూడి గ్రామ సచివాలయాల పరిధిలో 'ఆడుదాం ఆంధ్ర'ను తడ గవర్నమెంట్ హై స్కూల్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జరిగింది. ఈ కార్యక్రమానికి తడ సర్పంచి, వైసీపీ మండల కన్వీనర్ కె ఆర్ముగం, వైసిపి నాయకులు జాన్ శశికుమార్ , స్థానికులు కలిసి భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇతర వైస్సార్సీపీ నాయకులు రమేష్ ,యాలయ్య ,కస్తూరయ్య ,వెంకటరమణయ్య పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు కళా గాబ్రియేల్ ,జి.మస్తానయ్య పాఠశాల సిబ్బంది ,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నారాయణవనం: మండలంలోని జడ్పీ గర్ల్స్ హైస్కూలులో 'ఆడదాం ఆంధ్ర' క్రీడా సంబరాలను మంగళవారం ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రాజు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ దివాకర్ రెడ్డికి గ్రామ ప్రజలు ప్రజాప్రతి నిధులు క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్ ఏఈ షణ్ముఖం, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రాజు, గోవిందస్వామి, హెచ్ఎం శశికళ, సులోచన, సర్పంచ్ శారద, గణేష్ మండల కన్వీనర్ సొరకాయలు, సచివాలయ చిబ్బంది, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్పేడు: 'ఆడదాం ఆంధ్ర' ఏర్పేడు మండలంలో కొత్త వీరాపురం సచివాలయంలో కోబాకు గ్రామపంచాయతీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏర్పేడు ఎంఈఓ ,పంచాయతీ సెక్రటరీస్ లీలా కుమారి, షఫీ, శంకరం, సచివాలయ సిబ్బంది, సర్పంచి వై బుజ్జమ్మ ఏర్పాటు చేశారు.

పాపానాయుడుపేట జడ్పీ హై స్కూల్‌లో సర్పంచ్ మేకలత్తూరు లలిత కరుణాకర్ అధ్యక్షతన ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి ఎం హరికృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ గోవింద రాజులూ, ఎం ఈ ఓ , హెడ్మాస్టర్, ఎక్స్ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, ఎస్ హెచ్ జి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి మోహన్ రంగ వర్ధంతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వంగవీటి మోహన్ రంగ 35వ వర్ధంతిని పుత్తూరు పట్టణ బలిజ సంఘం నాయకులు, రాష్ట్ర కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. వంగవీటి మోహన్ రంగా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కాపు సంక్షేమ సేన ఆర్గనైజింగ్ సెక్రటరీ పి గోపి రాయల్, రాష్ట్ర కాపు రైతు విభాగం ఉపాధ్యక్షులు జి కృష్ణయ్య, బలిజ కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి -సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం పెద్ద ఈటి పాకం పంచాయతీ రాచ పాలెంలో మృతుడి కుటుంబ సభ్యులు వెంకట మ్మకు వైయస్సార్ బీమాలో తక్షణ సాయం గా పదివేల రూపాయలు నగదును అందించారు. మంగళవారం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రమేష్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ రూబెన్ పదివేల రూపాయలు నగదును బాధితురాలు వెంకటమ్మకు అందించారు. రాచపాలెం గ్రామానికి చెందిన మునెయ్య కుమారుడు కోనయ్య(47) కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఆరోగ్యం క్షీణించి సోమవారం రాత్రి మృతి చెందాడు. గ్రామ సర్పంచ్ రూబెన్ ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే ఎమ్మెల్యే మండల అధికారులతో మాట్లాడి తక్షణ సాయంగా వైయస్సార్ బీమా సాయంలో భాగంగా పదివేల రూపాయలు మంజూరు చేయించారు. ఈ క్రమంలో గ్రామ సర్పంచ్ రూబెన్ ఆర్థిక సాయాన్ని బాధితురాలికి అందిం చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామ వాలంటీరు భార్గవి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.


బీమా సాయం అందిస్తున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంటు

రాష్ట్రస్థాయి పోటీలలో 'బాపూజీ' విద్యా సంస్థ పిల్లల ప్రతిభ

ప్రజాశక్తి -ఏర్పేడు: రాష్ట్ర స్థాయి కబడ్డీ అండర్ 14, అండర్ 17,పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనపరచిన బాపూజీ విద్యా సంస్థ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఆర్య , దుర్గా ప్రసాద్ ,మానస,యన్ .దీపక్ , ఆర్ దీపక్ ప్రతిభ చూపారు. వీరిలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు యన్ దీపక్ , పి మానస లను పాఠశాల కరస్పాండెంట్ బాలాజీ నాయుడు గారు, డైరెక్టర్ అనిల్ నాయుడు , ప్రధానోపాధ్యాయుడు మధు అభినందించారు.

శానిటేషన్ మాఫియాపై విచారణ జరిపించాలి: సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శానిటేషన్ విభాగంలో కొందరు అవినీతిపరులు, వారికి నాయకత్వం వహించేవారు కుమ్మక్కై కోట్లాది రూపాయల వసూళ్లకు పాల్పడుతున్నారని, విధులకు కూడా హాజరు కాకుండా ఏళ్ల తరబడి వేతనాలు పొందుతున్నారని అనేకమార్లు మీడియాలో కథనాలు వస్తున్నా కమిషనర్ హరిత, సంబంధిత అధికారులు నోరు మెదపక పోవడం వెనుక కారణమేమిటో వెల్లడించాలని వేణుగోపాల్ డిమాండ్ చేశారు. అత్యంత పేదలైన శానిటేషన్ వర్కర్ల నోరు కొట్టి, కోట్లాది రూపాయలు దందా చేసే వారి పట్ల అధికారులు వహిస్తున్న మౌనం అనేక అనుమానాలకుదారి తీస్తోందని తక్షణం విచారణ జరిపించి శానిటేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని వేణుగోపాల్ ఆ ప్రకటనలో కోరారు. మేయర్ శిరీష జోక్యం చేసు కుని కార్మికులకు న్యాయం చేయాలని, కార్పొరేషన్ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలోని పట్టాభిరామాలయంలో షిరిడి సాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన రావూరు చంద్రాచారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని 51 మంది పేదలకు సంస్థ ప్రతినిధులు అల్లం రమణయ్య, పెళ్లూరు కోటేశ్వరరెడ్డి చేతులమీదుగాదుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అల్లం రమణయ్య మాట్లాడుతూ దాతల దాతృత్వంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా చంద్రాచారి సహకారంతో ఈరోజు 51 మంది అరుంధతీయవాడకు చెందిన పేదలకు దుప్పట్లను పంచడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీరామసేన అధ్యక్షులు కొడవలూరు హరీష్ రెడ్డి,తుమ్మ కిషోర్,ఆవుల సుబ్బయ్య,పన్నగ సాయి, వెంపులూరు బాబురావు పాల్గొన్నారు.

పాడి రైతులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- నారాయణవనం: మండల కేంద్రంలోని తుపాను ప్రభావంతో మృతి చెందిన ఆవులు, మేకలకు నష్టపరిహారం చెక్కు లక్ష పదివేలు రూపాయలను జడ్పీ గర్ల్స్ హై స్కూలులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాడి రైతులకు పంపిణీ చేశారు. మండలంలో 9 మూగజీవులు మృతి చెందాయి. ఆవులకు రూ.37,500 మేకలకు రూ.4000 చొప్పున చెక్కును అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువుల శాఖ అధికారులు ఉమామహేశ్వర్, ఆవుల ప్రసాద్, భార్గవి, కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, మండల కన్వీనర్ సొరకాయలు, డిసిసి డైరెక్టర్ ఊరప్ప, చార్మినార్ సుబ్రహ్మణ్యం, పాడి రైతులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి -రామచంద్రపురం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండల రక్షకభట నిలయాన్ని చంద్రగిరి డిఎస్పి డాక్టర్ యశ్వంత్ తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం ఈ ఏడాదికి సంబంధించి సంవత్సర నివేదికలను, సిడి ఫైల్స్, జీడి రిజిస్టర్, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషనుకు ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు రానున్న సందర్భంగా ముందస్తు జాగ్రత్తగా మండలంలో రౌడీ షీటర్లు అసాంఘిక శక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్సై గిరిబాబును ఆదేశించారు. గత ఎన్నికలలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, రీపోలింగ్ చోటు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగేలా చూడాలని సిబ్బందిని హెచ్చరించారు. సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకుని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి సీఐ రాజశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ గిరిబాబు, మునిరత్నం, శేఖర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి సురేష్, త్యాగరాజు, ఓబు, సుధాకర్ రెడ్డి, రమేష్ ధన శేఖర్ పాల్గొన్నారు.

'ఆప్ ద్వారానే సామాన్యుడి అభివృద్ధి '

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: ఆమ్ ఆద్మీ ద్వారా మాత్రమే సామాన్యుడు అన్నివిధాలుగా అభివృద్ధి సాధిస్తాడని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పన శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ మొరుంపల్లి నందిని ఆధ్వర్యంలో మంగళవారం వరదయ్యపాలెంలో జరిగిన సామాన్యుడి శంఖారావం లో ఆయన మాట్లాడుతూ దేశంలో నీతి, నిజాయతీకి పెద్ద పీట వేసి రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ఘనత ఒక్క ఆమ్ ఆద్మీ పార్టీకి మాత్రమే దక్కు తుందన్నారు. అలాంటి పార్టీ పరిపాలను మన రాష్ట్రంలోనూ తెప్పించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. భూకబ్జాలు, ప్రకృతి వనరుల దోపిడీలో నిమగ్నమైన నాయకులు ప్రజాసమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సామాన్యులు సారథులు కావడం ద్వారా మాత్రమే సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందన్నారు. నందిని మాట్లాడుతూ పేద, మధ్య తరగతి, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ప్రజలను సంఘటితం చేసి, సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతానన్నారు. ఆప్ లో చేరాలని అన్ని వర్గాలకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వరదయ్య పాలెం బస్టాండ్, గోవర్ధనపురంలో పార్టీ విధానాలపై అవగాహన కల్పిస్తూ వాలంటరీ మ్యాపింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆప్ మండల కన్వీనర్ సందింటి శ్రీనివాసులు రెడ్డి, పట్టణ నాయకులు షాజహాన్, పెమ్మినేటి భాస్కర్ రాయల్, మాచర్ల చంద్రయ్య పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహం అపహరణ

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం మేర్లపాక లోని ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహాన్ని దొంగలు అపహరించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కే. గంగాధర్ ఆలయాన్ని పర్యవేక్షించి చూడగా విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా మా గ్రామాన్ని దొంగల బెడద నుండి కాపాడాలని పోలీస్ అధికారులను కోరుతున్నామన్నారు.

ఆలయంలో విగ్రహం అపహరణకు గురైన దృశ్యం

గౌరవనీయ శ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో నాయుడుపేట, తిరుపతి జిల్లా.
O.S.NO. 43 / 2020
బసిరెడ్డి ప్రభావతమ్మ ......వాది
Vs
బుస్సా కస్తూరు రెడ్డి ...ప్రతివాది
దావా నోటీసు
టు
బుస్సా కస్తూరు రెడ్డి, తండ్రి సుధాకర్ రెడ్డి, పిచ్చిరెడ్డి తోపు, నాయుడుపేట టవున్ మరియు మండలము, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 524126
పై తెలిపిన వాది, మీరు తీసుకున్న అప్పు నిమిత్తము పై కోర్టులో సదరు అప్పు, వడ్డీ తో సహా రాబట్టుటకై O.S.NO. 43 / 2020 దావా మీ పై వేసి ఉన్నారు. సదరు దావా మీ నోటీసు నిమిత్తము తేది. 05-01-2024 న వాయిదా వేసిఉన్నది. కావున ఆ దినము మీరు స్వయముగా గాని, లేక మీ వకీలు ద్వారా గాని, పై కోర్టులో, పై తేదిన ఉదయం 10.30గం॥లకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
ఇట్లు,
మోరా ఈశ్వరయ్య, యం.ఎ., యం.ఎల్, పిజిఓ
అడ్వకేట్ / నోటరీ
తుమ్మూరు, నాయుడపేట
వాది తరపు న్యాయవాది

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.NO. 25 / 2018
గూడూరు మస్తానయ్య ......పిటిషనరు
Vs
ముంగర రవి మరియు ఇతరులు ....రెస్పాండెంట్స్
నోటీసు
టు
R5. కట్ట కోటేశ్వర రావు, తండ్రి బుర్రయ్య, తిన్నెలపూడి గ్రామం, కోట మండలం, తిరుపతి జిల్లా.
పై నంబరు పిటిషనులో పిటిషనరు తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్ చెయ్యమని పిటిషను దాఖలు చేసి ఉన్నారు. పై పిటిషనులో మీ యొక్క నోటీసు నిమిత్తం తేది. 2-1-2024 న వాయిదా వేసి యున్నారు. కావున మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో ఉదయం 10.30 గం॥లకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల పై విషయము మీ పరోక్షమున తీర్మానిచంబడును.
ఇట్లు,
పి. గోపాల్ రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
పి. నరేంద్ర, బి.ఎస్సీ, ఎల్ఎల్.బి.,
పిటిషనరు తరపు న్యాయవాదులు
గూడూరు.